## క్లుప్తంగా

### ఉచిత మెగా వైద్య శిబిరం

మోతీనగర్: ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన మంత్రి మోదీ తొమ్మిదేళ్ల విజయవంతమైన సుపరిపాలన సందర్భంగా అల్లాపూర్ డివిజన్ రామారావునగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అనేక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్, విజయ్, మల్లేష్, భాను, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ కార్యాలయం ప్రారంభం



కేఎస్‌నగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు, హరీష్‌రెడ్డి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని కేఎస్‌నగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ లీడర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌తో కలిసి కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లోని ఆడబిడ్డలను సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేర్చేందుకు తన వంతు సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అమ్రేష్ రాజు, విజయ్‌కుమార్, రేఖ, స్వాతి, పద్మ, సునీల్, వెంకట్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వెర్టిగో బాధితుల సరికొత్త యాప్

సాక్షి, సిటీబ్యూరో: వెర్టిగో అనారోగ్యం ఉన్నవారు రోజులో ఏ సమయంలోనైనా తమ ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించుకునేందుకు ఉపకరించే 'వెర్టిగో కోచ్'యాప్‌ను డిజిటల్ హెల్త్ సొల్యూషన్ సంస్థ అబాట్ రూపొందించింది. దీనిని నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రూపకర్తలు మాట్లాడుతూ.. వెర్టిగో బాధిత రోగులు అన్ని రకాల సమాచారం పొందడంలో సహాయపడే తమ యాప్ జీవనశైలి ఎంపికలు, వ్యాయామ చిట్కాలను అందిస్తుందన్నారు. యాపిల్ యాప్‌స్టోర్, గూగుల్ ప్లేస్టోర్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

### సన్మానం



దళితుల ఐక్యవేదిక నూతన సభ్యులను సన్మానిస్తున్న సింగూరు పాండు

కూకట్‌పల్లి: దళితుల ఐక్యవేదిక ముఖ్య ఉద్దేశం దళితులను ఐక్యం చేసి రాజ్యాధికారంలో వాటా సాధించాలని.. అప్పుడే ఐక్యవేదిక కల నెరవేరుతుందని ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సింగూరు పాండు పేర్కొన్నారు. ఆదివారం దయార్‌గూడలోని పార్కులో దళితుల ఐక్యవేదిక కూకట్‌పల్లి సర్కిల్‌లో నూతనంగా ఎన్నికై న కమిటీని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దళితుల ఐక్యవేదిక కేంద్ర కమిటీ అధ్యక్షుడు యడ్ల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఇనుగంటి రాజు, పెద్దిరాజు, లలిత, ప్రధాన కార్యదర్శి యడ్ల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు పీసీ అబ్బులు, బాడోళ్ల నగేష్, కందుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఖాజాగూడలో బోనాలు

రాయదుర్గం: ఖాజాగూడలో కాటమయ్య స్వామి బోనాల వేడుకలను సోమవారం నిర్వహించేందుకు కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఖాజాగూడలోని కాటమయ్య దేవాలయం వద్ద సాయంత్రం 5 గంటలకు బోనాల వేడుకలు, తొట్టెల ఊరేగింపు ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

### హైటెక్స్‌లో ముగిసిన హోరేకా ఎక్స్‌పో

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన హోరేకా ( హోటల్స్, రెస్టారెంట్స్, కేటరింగ్) ఎక్స్‌పో 2023 ఆదివారంతో ముగిసింది. ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు విరివిగా పాల్గొని ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన 300 బ్రాండ్‌లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బేకర్స్, రెస్టారెంట్స్, హోటల్స్, హోమ్‌చెఫ్స్‌లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 20 కేటగిరిలలో 50 మందికి అవార్డులను అందజేశారు. నగరంలోని పలు హోటళ్ల నిర్వాహకులకు బయ్యార్, సెల్లార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రోడ్ల నిర్మాణం ఎప్పుడు?








- అభివృద్ధి పనుల పేరుతో రోడ్ల తవ్వకాలు
- రాకపోకలకు కాలనీవాసుల ఇక్కట్లు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: తాగునీటి పైపులైన్ల నిర్మాణం పేరిట కాలనీల్లోని రోడ్లను తవ్వేస్తున్న అధికారులు పనులు పూర్తయి ఏడాది గడిచినా వాటికి తిరిగి మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారటంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షాలకే గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు, కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.

◆ ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో రోడ్ల దుస్థితి ఇందుకు నిదర్శనం. ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి తాగునీటి, డ్రైనేజీ పైపులైన్లు చేపట్టారు. దీంతో కాలనీలోని అంతర్గత రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి నడిచి వెళ్లేందుకు కూడా వీలు కావటం లేదు. రోడ్డుకు ఒక్కవైపే పైపులైన్ల నిర్మాణం కోసం తవ్వటంతో మరోవైపు వచ్చి పోయే వాహనాలు రాకపోకలు సాగించటంతో ఇబ్బందులు తప్పటం లేదు. ముందస్తు ప్రణాళిక లేకపోవటం వల్లే సౌకర్యంగా ఉన్న రోడ్లను తవ్వి పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ప్రజాధనం వృధా అవుతోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ తవ్విన అనంతరం పని పూర్తయ్యాక రోడ్ల నిర్మాణం చేపడుతున్నారా అంటే అదీ లేదు. వారి పనులు పూర్తి కాగానే తిరిగి ఆ రోడ్డు వైపు చూసిన నాధుడే కరువయ్యాడు. ఏళ్లు గడుస్తున్నా రోడ్ల నిర్మాణానికి మరమ్మతులు నోచుకోకపోవటంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయ్‌నగర్ కాలనీలో 1 నుంచి 6 రోడ్లు ఉన్నాయి. రెండు రోడ్లు మినహా మిగిలిన రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. గుంతలమయంగా మారిన రోడ్లలో రాత్రి పూట వెళ్లాలంటేనే బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. దాదాపు రెండేళ్లు గడుస్తున్నాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

◆ ఇన్ని రోజులైనా తమ కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులను ఇటు అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించటం లేదన్నారు. ఎన్నికల సమయంలో పాదయాత్రల పేరుతో కాలనీలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ప్రగల్భాలు పలికే ప్రజా ప్రతినిధులు ఎన్నికల తరువాత ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా విజయ్‌నగర్ కాలనీలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించి తమ కాలనీలో ఉన్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### విన్నవించినా ఫలితం లేదు



విజయ్‌నగర్ కాలనీలో రోడ్లు అధ్వానంగా మారాయి. దాదాపు రెండేళ్ల క్రితం మిషన్ భగీరథ అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లను తవ్వి పోశారు. తిరిగి ఇప్పటికి నిర్మాణానికి నోచుకోకపోవటంతో రోడ్లపై గుంతలు ఏర్పడి చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. తమ కాలనీలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. తమ చుట్టూ ఉన్న కాలనీలో అభివృద్ధి చెందుతున్నప్పటికి తమ కాలనీలో రోడ్లను ఎందుకు పట్టించుకోవటం లేదు.

– సురేష్, విజయ్‌నగర్ కాలనీవాసి

# అన్ని దానాల్లో అన్నదానం గొప్పది



ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిత్యాన్నదాన వాహనాన్ని ప్రారంభించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు



అల్విన్‌కాలనీ: ఇస్కాన్ సంస్థ మియాపూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిత్యాన్నదాన పథకానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్కాన్ మియాపూర్ ప్రతినిధులు పెద్ద మనస్సుతో గొప్ప నిర్ణయం తీసుకున్నారని అన్నారు. నిత్యాన్నదానం చేయటం చాలా గొప్ప విషయని కొనియాడారు. నిత్యాన్నదానం వాహనాన్ని ప్రారంభించటం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పేద ప్రజల ఆకలి తీర్చడానికి ఈ సంచార వాహనం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. పేదవాడి ఆకలి తీర్చే అక్షయ పాత్ర అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదన్నారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, నాయకులు శ్రీనివాస్, గోపరాజు, బాబ్జీ, రోజా, జోగిపేట బాలరాజు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలి



లోతట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌నగర్, లక్ష్మీనగర్, రామారావునగర్‌లలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ఆదివారం కార్పొరేటర్ సబిహా బేగం పర్యటించి స్థానికులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, సంజీవ, వెంకటయ్య యాదవ్, యోగిరాజు, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగింది

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



హఫీజ్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగిందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లోని మహీంద్రా అశ్విత అపార్టుమెంట్స్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మానస పుత్రిక హరితహారం కార్యక్రమం అని కాలనీ వాసులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొనడం, మన తెలంగాణ రాష్ట్రం పట్ల, పుడమి పట్ల, సీఎం కేసీఆర్‌కు ఉన్న ఆపేక్ష, ప్రేమ అర్థం అవుతుందన్నారు. గడిచిన సంవత్సరాలలో గరిష్ట రికార్డు స్థాయిలో 273 కోట్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 2015–16 నాటికి అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్లు ఉండగా, 2023 నాటికి 26,969 చదరపు కిలోమీటర్లకు పెరిగిందన్నారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఖాళీ స్థలాలు, రోడ్లకిరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, ప్రసాద్, దేవేందర్, నారాయణ, కృష్ణ, నర్సింగ్ రావు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

**మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే..**

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయే అని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ధీమా వ్యక్తం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి ఎన్టీఆర్‌కాలనీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మర్రి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. యువత అంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, సీఎంకేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్‌లో కొత్త, పాత కలయికతో అందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. శేరిలింగంపల్లిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అయ్యాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. శ్రీనివాసరావు, రమేష్, మహ్మద్, ఎండీ హమీద్, రషీద్, షకీల్‌పాషా, మహబూబ్‌ఖాన్, అల్తాఫ్, నూర్‌భాషా పార్టీలో చేరారు.

## బాలిక అదృశ్యం

మోతీనగర్: బాలిక అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లాపూర్ డివిజన్ పండిట్ నెహ్రూనగర్‌లో సయ్యద్ అజీముద్దీన్ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అజీముద్దీన్‌కు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. 2వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులందరు భోజనం చేసి పడుకున్నారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి చిన్న కుమార్తె సానియా మీర్జా (16) కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అజీముద్దీన్ చుట్టుపక్కల, బంధువుల దగ్గర గాలించినప్పటికి ఆమెకీ లభ్యం కాలేదు. దీంతో అల్లాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పౌరసరఫరాల శాఖలో అవినీతిపై ఫిర్యాదు

పంజగుట్ట: పౌరసరఫరాల శాఖలో ఎంతో అవినీతి జరుగుతున్నదని, అక్రమంగా రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని వీటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత షెడ్యూల్ కులాల షెడ్యూల్ తెగల సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి పేషీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు కె.మహేశ్వర రాజ్ మాట్లాడుతూ... కొంతమంది అధికారుల సాయంతో చాలా రేషన్‌షాపుల నిర్వాహకులు చనిపోగా వారి డెత్ సర్టిఫికెట్లు ఫేక్‌వి సృష్టించి అక్రమంగా రేషన్ షాపులు మంజూరు చేయించుకుంటున్నారని ఆరోపించారు. నకిలీ స్కూల్ సర్టిఫికెట్‌లు, తప్పుడు ఆధార్ కార్డులు సృష్టించి షాపులు తీసుకుంటున్నారని వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారమన్నారు. ఫిర్యాదుతోపాటు పలు ఆధారాలు జతచేసి పెట్టినట్లు ముఖ్యమంత్రి పేషీలో అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### జెమిలి ఎన్నికలకు వ్యతిరేకం

దళిత బహుజన పార్టీ

లిబర్టీ: వన్ నేషన్ ఎలక్షన్‌కు తాము వ్యతిరేకమని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ అన్నారు. అధికారం నుంచి దిగిపోతామనే ఆందోళనతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ జెమిలి ఎన్నికలను సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ, ఫెడరల్ వ్యవస్థలను ప్రధానమంత్రి విధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చి జమిలి ఎన్నికల పేరిట తిరిగి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతున్నదని విమర్శించారు. తమకు అనుకూలంగా ఉన్న వారిని ఒక కమిటీ వేసిందని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రస్తావించని పార్లమెంటు మరో ఐదు రోజులు సమావేశం చేయడానికి ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని మండిపడ్డారు. జమిలి ఎన్నికలకు మద్దతిస్తూ 2018వ సంవత్సరంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా లేఖ రాశారని ఆరోపించారు. ప్రధానమంత్రి వ్యవస్థను మంత్రి మండలి దెబ్బతీసి రాష్ట్రపతి తరహా పాలన సాగించేందుకు పెద్ద ఎత్తున కుట్రలు సాగుతున్నాయని విమర్శించారు. సమావేశంలో నేతలు దేవునూరి శ్రీనివాస్, వీరం సతీష్‌కుమార్, ఇటికాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు రాజ్యాధికారం సాధించాలి





పీజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన హిందూ బీసీ మహాసభలో పాల్గొన్న బీసీ నాయకులు

మోతీనగర్: వివేకానందనగర్ కాలనీ పీజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో హిందూ బీసీ మహాసభ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీల రాజ్యాధికార కోసం బీసీలంతా ఐక్యంగా ఉండి, బీసీలకే ఓటు వేసి, బీసీల రాజ్యాధికారం తెచ్చుకునే దిశలో ప్రయాణించాలన్నారు. వీపీసింగ్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతో తోడ్పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠాగోపాల్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జెర్రిపేటి జైపాల్, జాతీయ బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర, కార్యదర్శి పర్వత సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే ఎన్నికల్లో బీసీలకు 61 స్థానాలు కేటాయిస్తాం

తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ పార్టీ

ఫిలింనగర్: బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వుంజాల వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి దీనికి చైర్మన్‌గా వినయ్‌కుమార్‌ను, వైస్ చైర్మన్‌గా వడ్డెపల్లి రామకృష్ణ, కన్వీనర్‌గా పాండు యాదవ్‌ను ఎన్నుకున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 61 స్థానాలు, ఎస్సీలకు 22, ఎస్టీలకు 10, ముస్లింలకు నాలుగు స్థానాలు కేటాయిస్తామని తీర్మానాలు ఆమోదించారు.

# దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నాం



నవోదయ కాలనీలో డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతన్నామని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణ పనులను వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని గతంలో వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్లు స్థానంలో నూతన ఎక్కువ సామర్థ్యం కలిగిని డ్రైనేజీ పైపు లైన్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలతో, గడువులోపు పూర్తి చేస్తే ఇక్కడి ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు వెచ్చింది ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలమన్నారు. బస్తీ, కాలనీల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కాశీనాద్ యాదవ్, శివరాజ్‌గౌడ్, రాజిరెడ్డి, ఉమేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రశాంతి, సూపర్ వైజర్ నరేందర్ తదితరులు ఉన్నారు.

# మూగ జీవులకు అందని వైద్యం

- ఆసుపత్రుల్లో వసతులు కరవు
- అరకొర మందులు..సిబ్బంది కొరత
- జిల్లాలో 2 ఏరియా, 16 పట్టణ, 29గ్రామీణ పశువైద్య ఆస్పత్రి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వ పశువైద్యశాలల్లో ఒకవైపు మందుల కొరత, మరోవైపు అందుబాటులో సరిపడా లేని సిబ్బంది లేక పోవటంతో మూగజీవాల పెంపకం దారులకు ప్రైవేటు పశు దుకాణాలే దిక్కయ్యాయి. పాడి రైతులకు నిర్వహణ ఖర్చు పెరగడంతో నష్టాలపాలవుతున్నారు. పైగా వర్షాకాలం కావడంతో మూగజీవాలకు అనేక రోగాలు పొంచి ఉన్నాయి.

**కనీస వసతులు లేక..**

ఇరుకైన గదులు, శిథిలావస్థకు చేరిన వైద్య కేంద్రాలలో సరైన వసతులు లేక పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం తాగునీటి సదుపాయం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఉద్యోగులు, సిబ్బంది పడుతున్న అవస్థ అంతా ఇంతా కాదు. కూకట్పల్లి,గౌడవెల్లి ప్రాథమిక పశువైద్యశాలల భవనాలు శిథిలావస్థలో ఉండటంతో..వేరే చోట నడిపిస్తున్నారు.

**అందని మందులు..**

పశు వైద్యశాలలకు ప్రతి మూడు నెలలకొకసారి మందులకు ప్రభుత్వం రూ.7 లక్షల చొప్పున ఇస్తోంది. ఏడాదిలో నాలుగు విడతలకు రూ.28 లక్షలు మందులకు అందజేస్తోంది.నిర్దేశించిన విధంగా పశువైద్యశాలలకు విడతల వారిగా మందులకు నిధులు విడుదల చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాడి రైతులు పశు వైద్యశాలలకు వెళ్లేందుకు వెనకడగు వేస్తున్నారు.

**అడుగడునా నిర్లక్ష్యం..**

నగరానికి సమీపంలో పశువైద్యశాలలు ఉన్నా.. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంతో పశువులకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదని తెలుస్తోంది. ఒక్కలిద్దరు సిబ్బందితోనే పశు వైద్యశాలలను ఒక్కలిద్దరు సిబ్బంది మాత్రమే నడిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.పర్యవేక్షణ కొరవడటంతో రోజుల తరబడి పలు పశువైద్యశాలలకు డాక్టర్లు, సిబ్బంది రాకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు.

### 43 లక్షల పశుసంపద..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పశుసంపద 43,00,886 కాగా, ఇందులో గోజాతి పశువులు 27,068, గేదెజాతి పశువులు 59,895, గొర్రెలు 1,49,401, మేకలు 40 వేలు,పందులు, 2,485, కోళ్లు, 39,72,037, కుక్కలు 50 వేలు ఉన్నాయి.

### సిబ్బంది కొరత..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఏర్పడి ఐదేళ్లు గడిచినా... జిల్లాస్థాయి పశు వైద్యశాల లేదు. ప్రస్తుతం ఉన్న పశువైద్యశాలలో సిబ్బంది కొరత వేధిస్తోంది. మేడ్చల్, ఉప్పల్ ఏరియా ఆసుపత్రులతో పాటు ఘట్కేసర్, పోచారం, డబుల్పూర్, పూడూరు, ఎంసీపల్లి, ఉద్దమర్రి, శామీర్పేట్, యాంజల్, దుండిగల్, అల్వాల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, కూకట్పల్లి, మల్కాజిగిరిల్లోని ప్రాథమిక పశు వైద్య శాలల్లో డాక్టర్‌తో సహ ఇద్దరి సిబ్బంది చొప్పున.. ఉండాల్సి ఉండగా, చాలా చోట్ల ఖాళీలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో ఇద్దరు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, అటెండర్ పోస్టులతో సహ 21 ఖాళీలు ఉన్నాయి. దీంతో పశువులకు అరకొర వైద్యసేవలు మాత్రమే అందుతున్నాయి.